
ముద్దనూరు మండలం శెట్టివారిపల్లె గ్రామంలోకి వెళ్లే దారిలోని గాలేరు-నగిరి కాల్వ బ్రిడ్జి కోతకు గురైన దృశ్యం


ముద్దనూరు మండలం ఓబులాపురం ఎస్సీ కాలనీ దారిలో నిలిచిపోయిన రోడ్డు పనుల వద్ద ఆగిన వర్షపు నీరు


కొండాపురం మండలం చిన్నపల్లెలో ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

వర్షంతో జలమయం

ముద్దనూరు/కొండాపురం, ఆగస్టు 20: ముద్దనూరు, కొండాపురం, జమ్మలమడుగు మండలాల్లో సోమవారం రాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రమైన ముద్దనూరులో దాదాపు 25.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా చుట్టు పక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శెట్టివారిపల్లె వద్ద భారీ వర్షానికి గ్రామంలోకి వెళ్లే గాలేరు-నగిరి కాల్వపై ఉన్న బ్రిడ్జి కోతకు గురైంది. దీంతో ఆటోలు, బైకులు గ్రామంలో నుంచి టౌన్ వైపు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటి నుంచో గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని ప్రజలు వేడుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో చిన్న వర్షం కురిసినా వీరు అవస్థలు పడుతున్నారు. ఓబులాపురం గ్రామం ఎస్సీ కాలనీలోకి మోకాటి లోతు నీళ్లు చేరాయి. గతంలో హైవే రోడ్డు నుంచి ఓబులాపుం ఉర్లోకి, ఎస్సీ కాలనీలోకి సిమెంట్ రోడ్డు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ఓబులాపురం ఉర్లోకి సిమెంట్ రోడ్డు వేశారు. ఎస్సీ కాలనీ దారిలోని వంకలో రోడ్డు పనులు మధ్యలో నిలిపి వేశారు. దీంతో వర్షం కురిసిందంటే చాలు నీళ్ల నిలిచి రాకపోకలు బంద్ అవుతున్నాయి.

చిన్నపల్లె జలమయం

కొండాపురం మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి పలుచోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొర్లి ప్రవహించాయి. వర్షపు నీటితో మండలంలోని చిన్నపల్లె గ్రామం జలమయమయింది. గండికోట ఎత్తిపోతల పథకంలో భాగమైన తిమ్మాపురం చెరువుకు కట్ట వేయడంతో ప్రతిసారి వర్షం వచ్చినప్పుడు గ్రామాన్ని నీరు చుట్టుముడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల నీరు ఇళ్లలోకి చేరుతోందని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ గ్రామాన్ని ఇప్పటికైనా ముంపు జాబితాలోకి చేర్చి పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా జలమయమైన చిన్నపల్లెను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు మంగళవారం పరిశీలించారు. జమ్మలమడుగు పట్టణం సైతం సోమవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైంది.


పోరుమామిళ్లలో వంద రోజుల లక్ష్యంలో ఉన్న సుందరయ్యకాలనీ లేఅవుట్

100 రోజులు.. 10,749 ఇళ్లు

- గృహ నిర్మాణశాఖ లక్ష్యం
- ఊపందుకున్న నిర్మాణాలు
- కొన్ని చోట్ల ఇసుక కొరత
- పురోగతిపై వెరిఫికేషన్ యాప్‌లో నమోదు
- టార్గెట్‌లో ఇప్పటికే 148 ఇళ్లు పూర్తి

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1,05,867 గృహాలు మంజూరయ్యాయి. అయితే 99,975 గృహాలు మాత్రమే మొదలయ్యాయి. జిల్లాలో 430 లేఅవుట్లు ఉన్నాయి. జగన్ హయాంలో గృహ నిర్మాణం పడకేసింది. బిల్లులు రాకపోవడం, లేఅవుట్లలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం పట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల గృహ నిర్మాణాలపై దృష్టి సారించింది. టీడీపీ కూటమి ప్రభుత్వం పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ శాఖ అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తోంది. నిర్మాణాలను వేగవంతం చేసేందుకు గాను పూర్తయిన ఇళ్లకు చకాచకా బిల్లుల చెల్లింపు చేస్తోంది. అయితే కొన్ని చోట్ల ఇసుక కొరత కారణంగా గృహ నిర్మాణాలకు ఇబ్బందిగా మారింది. ఇక స్వయం సహాయక సంఘాల నుంచి ఇంటి నిర్మాణానికి సంఘం స్థాయికి బట్టి రూ.35వేలు మొదలుకుని లక్ష రూపాయల వరకు రుణ సాయం అందిస్తున్నారు. అయితే కొందరికి ఇళ్లు మగవారి పేరిట మంజూరు కావడంతో స్వయం సహాయక సంఘాల నుంచి రుణ సాయం అందడం లేదు. ఇది 100 రోజుల లక్ష్యానికి అడ్డంకిగా ఏర్పడింది.

ఇక నిర్మాణాలు వేగవంతం

వంద రోజుల్లో 10,749 ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా గృహ నిర్మాణ శాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. త్వరితగతిన పూర్తయ్యేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందుకోసం వెరిఫికేషన్ యాప్‌ను తీసుకు వచ్చింది. క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంటు వారికిచ్చిన టార్గెట్ మేరకు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. పునాదుల లెవల్‌లో ఉన్న ఇంటిని బేస్‌మెంట్ లెవల్‌కు, బేస్‌మెంటు స్థాయిలో ఉన్న ఇంటిని లింటల్ లెవల్‌కు, లింటల్ లెవెల్ ఉన్న ఇంటిని రూఫ్‌లెవల్.. అలా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా అక్టోబరు నాటికి 10,749 ఇళ్లు పూర్తి చేయడం లక్ష్యం కాగా.. 40వేల ఇళ్లను నిర్మాణాల దశలను మార్చాల్సి ఉంది. అంటే దాదాపు 58వేల ఇళ్ల నిర్మాణాలు ఊపందుకోనున్నాయి. జిల్లాకు మంజూరైన 99,975 ఇళ్లలో ఇప్పటి వరకు 35,461 పూర్తయ్యాయి. 64,514 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. బ్యాలెన్స్ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయనున్నారు. రోజువారి ఇళ్ల పురోగతిని వెరిఫికేషన్ యాప్‌లో నమోదు చేస్తారు. లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, ఇనుము, సామాగ్రి అందుబాటులో ఉంచుతారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లించనున్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం దగ్గర సుమారు రూ.700 కోట్లు నిధులు ఉన్నాయి. పులివెందుల, బద్వేలు, కడప, మైదుకూరు, ఎర్రగుంట్లలో 30 లేఅవుట్లలో ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు ఇళ్లను కడుతున్నారు. అయితే జేఎస్ఆర్, రాక్రీట్ కంపెనీలకు సంబంధించిన బిల్లులపై ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విచారణ చేస్తోంది. ఆ రెండు సంస్థలు తప్ప మిగతా కాంట్రాక్టర్లు కట్టే ఇళ్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు ఇప్పటికే వారితో కలెక్టరు శివశంకర్ సమావేశం నిర్వహించారు. ఇళ్లు పూర్తి చేయండి, మీ బిల్లులు చెల్లిస్తామని చెప్పుకొచ్చారు.

జిల్లాలో ఇళ్ల నిర్మాణం ఇలా..

జిల్లాకు మంజూరైన ఇళ్లు	1,05,867
రిజిస్టరు అయిన ఇళ్లు	99,975
ఇప్పటి వరకు పూర్తయినవి	35,461
వివిధ దశల్లో ఉన్నవి	64,514
వందరోజుల్లో పూర్తి చేయాలనుకున్న ఇళ్లు	10,749
ఇటీవల పూర్తయినవి	148

ఇసుక కొరత

గృహ నిర్మాణశాఖ వంద రోజుల లక్ష్యానికి ఇసుక కొరత అడ్డంకిగా మారే అవకాశం ఉంది. జిల్లాలో 10,749 ఇళ్లు పూర్తి, మరో 47వేల ఇళ్ల నిర్మాణ స్టేజీ మార్పు కోసం పనులు వేగంగా జరగనున్నాయి. అయితే ఇక్కడ ఇసుక కొరత వేధిస్తోంది. ప్రస్తుతం రీచ్‌లు లేవు. కొత్తరీచ్‌లు మొదలు కాలేదు. స్టాకు పాయింట్లలోని ఇసుక మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంది. ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్లు తీసుకోవాల్సి ఉంది. వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత ఎదురవుతోంది. అలాగే స్వయం సహాయక సంఘాల్లో మహిళలు ఉంటారు. అయితే మహిళల పేరిట ఇళ్లు మంజూరైతేనే ఇంటి నిర్మాణానికి సంఘాల ద్వారా రుణం ఇస్తున్నారు. పురుషుల పేరిట అయితే ఇవ్వడం లేదు. స్త్రీ పురుషులు అన్న బేధం లేకుండా లబ్ధిదారుని కుటుంబం పేరిట రుణం ఇస్తే నిర్మాణాలను లక్ష్యం మేరకు పూర్తి చేసే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు దాటింది. ప్రజల ఆకాంక్షల మేరకు పాలన ఊపందుకుంటోంది. ఇళ్ల నిర్మాణాలను రికార్డుల్లో కాకుండా గ్రౌండ్ లెవల్‌లో శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకు గాను వంద రోజుల లక్ష్యాన్ని పెట్టుకుంది. జిల్లాలో గృహ నిర్మాణశాఖ వంద రోజుల లక్ష్యంలో 10,749 ఇళ్లను పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది. అలాగే పునాదుల స్థాయిలో ఉన్న వాటిని బేస్‌మెంట్లు, ఆ స్థాయిలో ఉన్న ఇళ్లను లింటల్ లెవల్, రూఫ్ లెవల్ ఇలా.. 47వేల ఇళ్లను పునాది నుంచి రూఫ్‌లెవల్ వరకు తీసుకువచ్చేలా లక్ష్యం పెట్టుకున్నారు. టార్గెట్ పెంచేందుకు గృహ నిర్మాణశాఖ యంత్రాంగం క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పనిచేస్తుండడంతో మళ్లీ ఇళ్ల నిర్మాణంలో పురోగతి కనిపిస్తోంది. వంద రోజుల లక్ష్యంలో ఇప్పటికి 148 ఇళ్లు పూర్తయ్యాయి.


కమలాపురంలో వంద రోజుల లక్ష్యంలో పూర్తయిన ఇల్లు

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

- క్రిష్ణయ్య, జిల్లా గృహ నిర్మాణశాఖాధికారి



రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని నిర్ణయించింది. వంద రోజుల లక్ష్యంలో భాగంగా జిల్లాలో అక్టోబరు 2 నాటికి 10,749 ఇళ్లు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 148 పూర్తి చేశాం. గృహ నిర్మాణ శాఖ రోజువారి పురోగతిని వెరిఫికేషన్ యాప్‌లో నమోదు చేస్తాం. లబ్ధిదారులు కూడా వెరిఫికేషన్ యాప్‌లో తన ఇంటి డిటెయిల్స్‌ను చూసుకోవచ్చు. ఇంటినిర్మాణం ఏ దశలో ఉంది, బిల్లు ఎంత వరకు వచ్చింది, మొత్తం సమాచారం ఉంటుంది. బిల్లులు రాకపోయినా లబ్ధిదారులు అడగొచ్చు. త్వరితగతిన ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి.

పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి
- కలెక్టర్ శివశంకర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 20: జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు మూలమని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాల్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పారిశ్రామిక పెట్టుబడులను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. అదే దిశగా జిల్లాలో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇండస్ట్రియల్ పాలసీకి అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వనున్నట్టు తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి రావాలనుకునే వారిని ప్రోత్సహించేందుకు బ్యాంకరతో సమన్వయం చేస్తామన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ నూతన పారిశ్రామిక వేత్తలకు సంబంధించి పెండింగ్ రాయితీ విడుదల చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం వివిధ సెక్టార్లకు సంబంధించిన అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్ట్మెంట్స్ కృష్ణమూర్తి, ఇండస్ట్రియల్ జీఎం జయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజరు జనార్ధనం, అసోసియేట్ మెంబర్లు డిక్కీ కో-ఆర్డినేటర్ శివశంకర్, రామ్మూర్తి నాయక్, సిక్కి కో-ఆర్డినేటర్ సి.బాబురమణ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ సభకు పకడ్బందీ ఏర్పాట్లు

రైల్వేకోడూరు, ఆగస్టు 20: మైసూరివారిపల్లెలో ఈ నెల 23న గ్రామసభ నిర్వహించడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వస్తున్నారు. గ్రామసభకు ఏర్పాట్లు చేయడానికి గ్రామంలోనే స్థలాన్ని చదును చేయించే పనుల్లో మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, సీనియర్ నాయకుడు పగడాల చంద్రశేఖర్ మంగళవారం నుంచి నిమగ్నమయ్యారు. జిల్లా యంత్రాంగం అంతా మైసూరివారిపల్లెపైనే దృష్టి పెట్టింది. గ్రామసభ నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. 3 వేల మంది కూర్చునే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

మైన్స్ దందాను అరికట్టాలి

- రైతులను గట్టెక్కించాలి
- విద్య, వైద్యసేవలను మెరుగుపరచాలి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో పలువురు జడ్పీటీసీలు

కడప(రూరల్), ఆగస్టు 20: జిల్లాలో ఎక్కడ చూసినా మట్టి, ఇసుక, మైన్స్ దందా సాగుతోందని వీటిని వెంటనే అరికట్టాలని ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం జడ్పీ సమావేశ హాలులో ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద అధ్యక్షతన ప్రణాళిక మరియు ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణపు పనులు, విద్య మరియు వైద్యసేవల స్థాయీ సంఘ సమావేశాలను ఒకేసారి నిర్వహించారు. ఈ సమావేశంలో కమలాపురం, పోరుమామిళ్ల, వేంపల్లె జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ.. మైన్స్ దందాపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను నిలదీశారు. వైసీపీ పాలనలో తాను పొలానికి మట్టి తోలుకుంటుంటే రూ.10వేలు జరిమానా వేశారని ఆ నిబంధనలను టీడీపీ పాలనలో ఎందుకు పాటించడం లేదని వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ప్రశ్నించారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ గతంలో అభివృద్ధి పనులకు కూడా అనుమతులు లేనిదే మట్టిని తీసుకెళ్లనిచ్చేవారు కాదని ఇప్పుడు టీడీపీ నేతలు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని యథేచ్ఛగా తీసుకెళ్తున్నారని మండిపడ్డారు. ఇలా అయితే తాము కూడా అనుమతులు లేకుండా మట్టిని తీసుకెళతామని అన్నారు. జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లు నాణ్యత లేని నీటిని అమ్ముతూ ప్రజలను దోపిడీ చేస్తున్నాయని పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య, కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నా ఆర్‌డబ్ల్యుఎస్‌శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వేంపల్లెలో రింగ్‌రోడ్డు నుంచి ఆర్ అండ్ బి బంగ్లా వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉందని ఈ విషయాన్ని పలు సమావేశాలల్లో విన్నవించినా పంచాయతీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోవం లేదని వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కో-ఆప్ష సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ జిల్లాలోని షాదీఖానాల ద్వారా వచ్చే ఆదాయం ఎంత..? ఎక్కడ జమ అవుతోంది తెలియడంలేదని వాటి వివరాలను మైనార్టీ సంక్షేశాఖ స్పష్టం చేయాలని కోరారు. విద్య, వైద్యసేవలను మెరుగుపరచాలన్నారు.


జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద

రైతులను ఆదుకోండి

అలాగే డీపీఆర్‌సీ భవనంలో వైస్ చైర్మన్ బాలయ్య అధ్యక్షతన వ్యవసాయం, మహిళా సంక్షేమ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం అధ్యక్షురాలు సి.పుష్పలత (చిట్వేలి జడ్పీటీసీ) సమావేశానికి హాజరు కానందున బాలయ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రాయపేట, రామాపురం జడ్పీటీసీలు శివప్రసాద్‌రెడ్డి, వెంకటరమణ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయని బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కల్తీ పురుగుమందులను, ఎరువులను అరికట్టాలన్నారు. యంత్రపరికరాలను రైతులకు సకాలంలో అందించాలన్నారు. కాగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి జడ్పీటీసీలు తక్కువ మంది హాజరయ్యారు. మహిళా సంక్షేమ స్థాయి సంఘ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడం విశేషం. మొత్తం మీద 50 శాతం మంది కూడా హాజరు కాలేదు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆ జడ్పీటీసీ రూటే వేరు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనల్లుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి కుమారుడు చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి స్టాండింగ్ కమిటీ సమావేశాల వైపే చూడడం లేదు. 2021 సెప్టెంబర్‌లో జడ్పీ పాలకమండలి ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 13 స్టాండింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. కానీ చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ మాత్రం ప్రారంభంలో ఒకటిరెండు సమావేశాలకు తప్ప ఆ తదుపరి సమావేశాలకు హాజరు కాలేదు. దీంతో చింతకొమ్మదిన్నె మండలంలోని సమస్యలను స్టాండింగ్ కమిటీ సమావేశంలో లేవనెత్తే వారు లేరు.

మట్టి దోపిడీపై విచారణ

- ఎన్జీటీకి పుట్టా ఫిర్యాదుతో కదలిక
- చాపాడు, రాజుపాళెం మండలాల్లో మట్టికట్టలను పరిశీలించిన బృందం
- మూడు రోజుల్లో నివేదిక పూర్తికి అధికారుల యత్నం

ప్రొద్దుటూరు, ఆగస్టు 20: వైసీపీ ప్రభుత్వంలో కుందూనది విస్తరణ పేరిట సాగించిన మట్టిదోపిడీపై ప్రత్యేక అధికారుల బృందం విచారణ చేపట్టింది. మంగళవారం ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల బృందం చాపాడు మండలంలోని సీతారాంపురం దువ్వూరు మండలంలోని నేలటూరు, రాజుపాళెం మండలం టంగుటూరు తదితర గ్రామాల్లో కుందూ నది ఒడ్డున ఉన్న మట్టి కట్టలను పరిశీలించింది.

పెన్నానది కర్నూలు జిల్లా బనకచర్ల దగ్గర నుంచి వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లెలో కుందూనదిలో కలిసే వరకు 186 కి.మీ మేర ఉన్న కుందూనదిని విస్తరించే పేరిట మొత్తం రూ.1200 కోట్లతో వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టింది. కర్నూలు, కడప జిల్లాల్లో దాదాపు రూ.100 కోట్ల మేర నదిలో తవ్వకాలు జరిపి విస్తరణ పనులు చేపట్టింది. కడప జిల్లాలో రాజుపాళెం, చాపాడు మండలాల్లోని కుందూనదిలో దాదాపు రూ.25 కోట్ల మేర పనులు చేపట్టినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ ఒక్కరూపాయి కూడా కాంట్రాక్టరుకు బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వైసీపీ కాంట్రాక్టర్లే నది నుంచి తవ్విన ఇసుక, మట్టిని అక్రమంగా రవాణాచేసి కోట్లు గడించినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా నది అంచున పోసిన మట్టికట్టలన్నీ వైసీపీ నేతలు అక్రమంగా ప్రైవేటు వెంచర్లకు తరలించి డబ్బులు దండుకున్నారు.

కాగా.. కుందూ నది విస్తరణ పేరిట నదిలో ఇసుక, మట్టిని దాదాపు 3.24 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిపి నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. కుందూ నదిలో మట్టి, ఇసుక అక్రమ తవ్వకాలపై మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎన్జీటీకి ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కలెక్టర్ ఆదేశాలతో అధికారుల బృందం విచారణ చేపట్టింది. ఎన్జీటీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న మేరకు కుందూనదిలో తవ్విన 3.24 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలు ఉన్నాయా లేవా అని ఈ బృందం పరిశీలించ నుంది. ఈ బృందం చాపాడు, రాజు పాళెం, దువ్వూరు మండలాల్లో కుందూనది విస్తరణలో బాగంగా చేపట్టిన మట్టి తవ్వకాలు, నిల్వ ఉంచిన మట్టి కట్టలను పరిశీలించారు. వీటి పరిమాణాన్ని లెక్కకట్టేందుకు యత్నించారు. అయితే దాదాపు 60 శాతం వరకు మట్టికట్టలు మాయం అయ్యాయని సమాచారం.

మూడు రోజుల్లో ఎన్జీటీకి నివేదిక

కుందూ నదికి వచ్చిన నీటి వల్ల నది ఒడ్డున ఉన్న మట్టికట్టల పరిమాణాన్ని కొలవడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. నదిలో నీళ్ల తగ్గిన వెంటనే మూడు రోజుల్లో చాపాడు, దువ్వూరు మండలాల్లోని కుందూ నదిలో మట్టి కట్టలను పరిశీలించి అవి ఎంత పరిమాణంలో ఉన్నాయో ఎన్జీటీకి నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ అధికారుల బృందంలో తెలుగుగంగ ఎస్ఈ సుబ్బరాయుడు, డీఈ బ్రహ్మానందరెడ్డి, ఏఈలు సుబ్బరాయుడు, జాన్సన్, పవన్‌కుమార్‌రెడ్డి, మైనింగ్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రవిప్రసాద్, చాపాడు తహశీల్దారు రవీంద్రారెడ్డి, దువ్వూరు తహశీల్దారు మధురవాణి, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ ఉన్నారు.


కుందూ నదిలో తవ్వి వేసిన మట్టికట్టలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

వైసీపీ నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

- పాఠశాలల్లో నిలిచిపోయిన నాడు-నేడు పనులు
- సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోనే..
- టీడీపీ ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలి
- విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20: గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు అసౌకర్యాల నడుమ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రొద్దుటూరు మండలంలో 110 ప్రభుత్వపాఠశాలలు ఉండగా... 2019లో రూ.9కోట్లతో 38 పాఠశాలలో నాడు-నేడు పనులు చేపట్టి పాఠశాలలను ఆధునీకరించారు. మొదటి విడత పనులు విజయవంతం కావడంతో రెండో విడత నాడు-నేడు పనులను 66 పాఠశాలలో రూ.22 కోట్లతో చేపట్టారు. 2022 ఏప్రిల్‌లో పనులు చేపట్టాలని ఆదేశించినప్పటికీ అక్టోబరులో ప్రారంభించారు. అదనపు తరగతి గదులు, వంటగదులు, మరుగుదొడ్లు, కాంపౌండ్‌వాల్, మేజర్, మైనర్ రిపేర్లు, పాఠశాలల పరిధిలో నిర్వహించగా టెన్‌కాంపోనెంట్స్ కింద టీవీలు, ఫ్యాన్లు, బెంచీలు, లైట్లు, పెయింట్, వాల్‌పెయింటింగ్, టాయిలెట్స్ పరికరాలన్నీ ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది.

అసంపూర్తిగా రెండో విడత పనులు

నాడు-నేడు పనులు స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీ (ఎస్‌ఎంసీ)ల ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంది. అయితే వైసీపీ నాయకులు ఎస్‌ఎంసీ కమిటీలను పక్కనబెట్టి పాఠశాలలో పనులు చేపట్టారు. వారు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టకుండా ఇష్టానుసారం చేయడంతో చాలవరకు పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం, అధికారులు ఒత్తిడి తెచ్చినా.. నిధులు విడుదల కాకపోవడంతో అనేక పాఠశాలలో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని పాఠశాలలో తరగతి గదులు, మరికొన్ని పాఠశాలలో మరుగుదొడ్లు, ఇంకొన్ని పాఠశాలలో వంట గదులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేయాల్సిన టీవీలు, బెంచీలు, టాయిలెట్స్ పరికరాలను కొన్ని పాఠశాలలకు అందజేయలేదు.

పూర్తికాని పెయింటింగ్ పనులు

చాల వరకు పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా ఉంటే.. పెయింటింగ్ పనులు, వాల్‌రైటింగ్ అనేక పాఠశాలలో చేపట్టలేదు. ప్రభుత్వం పెయింటింగ్ కంపెనీలకు నిధులు చెల్లించకపోవడంతో ఆ కంపెనీలు అసంపూర్తిగా పనులు చేపట్టాయి. దీంతో తరగతి గదులు పూర్తయినప్పటికి పాఠశాలలో పెయింటింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక అసంపూర్తిగా ఉన్న తరగతి గదులలోనే క్లాసులు నిర్వహిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి గడువు విధించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం .. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో చాలా పాఠశాలల్లో పనులు నిలిచిపోవడానికి కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాడు-నేడు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిధులు వస్తే.. పనులు పూర్తి చేస్తాం

నిధులు విడుదలైన మేరకు రెండో విడత నాడు-నేడు పనులు పూర్తయ్యాయి. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. నిధులు వస్తే పనులు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- సావిత్రమ్మ, ఎంఈవో, ప్రొద్దుటూరు



దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కిటికీలు, తలుపులు లేక తరగతి గదిలోకి చేరిన వర్షపునీరు




కామనూరు ఎంపీపీ స్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న తరగతి గది, హౌసింగ్ బోర్డు కాలనీ పాఠశాలలో పునాదులకు పరిమితమైన వంట గది, ఎస్‌వీవీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాత గేటుకే కడ్డీలు అమర్చిన దృశ్యం

స్మార్ట్ మీటర్‌తో అనేక ప్రయోజనాలు

- ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ ఎస్ఈ రమణ

రైల్వేకోడూరు, ఆగస్టు 20: స్మార్ట్ మీటర్‌తో వినియోగదారులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్. రమణ తెలిపారు. ఈనెల 23న ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ రైల్వేకోడూరుకు వస్తున్న సందర్భంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్ మీటర్ల పనితీరు, విద్యుత్ సమస్యలపై పరిశీలించిన ఆయన మాటాడుతూ డిప్యూటీ సీఎం పర్యటనలో విద్యుత్ లోపాలు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించామని తెలి పారు. స్మార్ట్ మీటర్ వల్ల వినియోగదారులకు ఏ సమయంలో ఎంత విద్యుత్‌ను విని యోగిస్తున్నామనేది ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా తెలుసుకునే సదుపాయం ఉంటుం దన్నారు. ఎక్కడ విద్యుత్‌ను వృథా చేస్తున్నారో అనేది కూడా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. గృహ విద్యుత్ ఉపకరణాలు పాడైనప్పుడు అవి విద్యుత్‌ను అధికంగా తీసుకుంటాయన్నారు. విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చాయని విద్యుత్ కార్యాలయా లకు తిరగకుండా ఎప్పటికప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్‌లోని యాప్ ద్వారా విద్యుత్ వినియోగం గమనించే వీలుందన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం అనేక సంస్క రణలు చేపట్టామని తెలిపారు. రెండో విడతలో గృహాలు, వాణిజ్యాలు తదితర వాటికి స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజి నీర్ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్‌రావు, అసిస్టెంట్ ఇంజనీర్ యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.


అటవీశాఖ అతిథిగృహం వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్ పనితీరును పరిశీలిస్తున్న రమణ

ఇన్‌స్పైర్ మనక్ పట్ల విద్యార్థుల్లో స్ఫూర్తిని కలగజేయాలి : డీఈవో

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20: ఇన్‌స్పైర్ మనక్ పట్ల విద్యార్థులకు స్ఫూర్తిని కలగజేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి అనురాధ అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఇన్‌స్పైర్ మనక్‌కు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా పేరును ఉన్నతంగా ఉంచాలని సూచించారు. సమస్యలను విద్యార్థులు గుర్తించి... పరిష్కారం విద్యార్థి కనుగొనేటట్లు చేయాలని... ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శకం వహించాలని చెప్పారు. సోషల్ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను గైడ్ చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో కడప ఉపవిద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి పలువురు పాల్గొన్నారు.

కార్ డెకార్స్‌లో అగ్ని ప్రమాదం

రాజంపేట టౌన్, ఆగస్టు 20: రాజంపేట పట్టణంలోని ఉస్మాన్‌నగర్ బైపాస్‌రోడ్డులో మంగళవారం వీఆర్ కార్ డెకార్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వీఆర్ కారు డెకార్స్ యజమాని వెంకటరమణ మధ్యాహ్నం భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి యజమానికి సమాచారం అందించారు. షాపు వద్ద దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడానికి ప్రయత్నించారు. అప్పటికే షాపులో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు యజమాని పేర్కొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు


యావజ్జీవ కారాగార శిక్ష పడ్డ నాగరాజు

చెన్నూరు, ఆగస్టు 20 : మండలంలోని కొండపేటకు చెందిన జ్యోతి అనే మహిళను హత్య చేసిన ఘటనలో బోయ నాగరాజు అనే వ్యక్తికి జీవిత ఖైదు పడింది. జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి సెషన్స్ జడ్జి షేక్ ఇంతియాజ్ హమీద్ మంగళవారం వెలువరించిన తీర్పులో బోయ నాగరాజుకు వెయ్యి రూపాయల జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. మండలానికి చెందిన జ్యోతి, ఆమె భర్త రంగనాయకులు బుక్కరాయసముద్రంకు చెందినవారు. వారు కొండపేటకు బతుకుదెరువు నిమిత్తం వచ్చారు. ఈ క్రమంలో బోయనాగరాజు ఆమెను ఇంట్లో ఎవరూ లేని సమయంలో 17.2.2022న హత్య చేశాడు. అప్పట్లో ఎస్ఐగా ఉన్న శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ అనంతరం మంగళవారం బోయనాగరాజుకు యావజ్జీవకారాగార శిక్ష విధించినట్లు చెన్నూరు సీఐ పురుషోత్తంరాజు తెలిపారు.

స్మగ్లర్లు పరార్... వాహనం స్వాధీనం

సుండుపల్లె, ఆగస్టు 20: ఎర్రచందనం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా.. వారిపై దాడి చేయడంతో పరార్ అయినట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో పీలేరు రహదారి నుంచి సుండుపల్లె మీదుగా డస్టర్ వాహనంలో స్మగ్లర్లు అడవిలోకి ప్రవేశించేందుకు 6 మంది ప్రయత్నించారు. వారిని వెంబడించగా ఎదురుగా వచ్చిన ఒక ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, ఫారెస్టు సిబ్బంది వాహనాన్ని ఆపుతున్న ఆపకుండా ఐదుగురు స్మగ్లర్లు వానరాచపల్లి సమీపంలో పారిపోయారు. ఒక వ్యక్తి వాహనాన్ని తీసుకొని పారిపోతుండగా వెంబడించడంతో రాయచోటి సమీపంలో గంగోత్రి ఫ్యాక్టరీ వద్ద వాహనాన్ని వదిలిపెట్టి పరారయ్యారన్నారు. వాహనంతో పాటు 5 గొడ్డళ్లు, ఒక రంపం, 8 చిన్న చిన్న బియ్యం ప్యాకెట్లు, ఆరు బ్యాగులు, ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన స్మగ్లర్ల కోసం ఫారెస్టు అధికారులు గాలిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌వో రజిని, డీఆర్‌వో రమేశ్‌బాబు, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా - 13 మందికి గాయాలు

బద్వేలు రూరల్, ఆగస్టు 20 : మండల పరిధిలోని లక్ష్మిపాలెం గ్రామానికి చెందిన కూలీలు మంగళవారం పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 13మందికి తీవ్ర గాయాలయ్యాయి. బి.మఠం మండలంలోని సోమిరెడ్డిపాలెంకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వచ్చే క్రమంలో నేలటూరు గ్రామ సమీపంలోకి రాగానే ముళ్లపొదల్లో నుంచి గేదె రోడ్డుపైకి అకస్మాత్తుగా అడ్డు వచ్చింది. దీంతో ఆటో గేదెను ఢీకొట్టి బోల్తాపడటంతో కూలీలు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవరు కాశి, వెంకటమ్మల పరిస్థితి విషమంగా ఉండడంతో కడపకు తరలించినట్లు బంధువులు తెలిపారు.

ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలి : వీసీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20: స్వీయత లేని ఫలితాలను నమ్మవద్దని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి అన్నారు. మంగళవారం వైవీయూ ఎన్ఎస్ఎస్, జేవీవీ ఆధ్వర్యంలో నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన సాంకేతికతతో దేశం పురోగమిస్తుంటే మరో వైపు మూఢ నమ్మకాలు విశ్వసిస్తుండడం బాధాకరమన్నారు. ఆర్థిక స్వావలంబనతో శాస్త్రీయత సాధ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజిస్ట్రారు రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాల్యదశ నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలన్నారు. జేవీవీ రాష్ట్ర కోశాధికారి రాజశేకర్‌రాహుల్ మాట్లాడుతూ సైన్స్ మార్పును కోరుతుందన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ విశ్రాంత మేనేజరు గోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సునీత, సరస్వతి, బాల బయన్న, వెంకటేశ్వర్లు, శివరాం, కిరణ్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి


పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా చేస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 20: ఆర్టీసీ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌తో జీవనం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నాలుగు జిల్లాల (కడప-కర్నూలు-అనంతపురం- చిత్తూరు)కు చెందిన నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వై.రాజారెడ్డి, ఎంవీ నారాయణ, రవీంద్రనాథ్‌వర్మ, (కడప) నాగయ్య, వైసీఎస్ రెడ్డి (అనంతపురం) జేఎంఆర్ నాయుడు, శేషాద్రి, (చిత్తూరు) శ్రీనివాసులు, (కర్నూలు) మాట్లాడారు. చాలీ చాలని పెన్షనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విచారం వ్యక్తం చేశారు. ముఖ్యంగా షుగర్, బీపీ సమస్యలతో సతమతమవుతున్న వారికి వచ్చే పెన్షన్ డబ్బులు సరిపోకపోవడం వల్ల ఇతర కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తమ గోడును అర్థం చేసుకుని కనీస పెన్షన్ రూ. 9వేలు అందేలా చూడాలన్నారు. ప్రధానంగా హయ్యర్ పెన్షన్ అమలు చేసే క్రమంలో జాప్యాన్ని నివారించి సత్వరమే మంజూరు చేయాలన్నారు. హయ్యర్ పెన్షన్ లెక్కించే విధానం గురించి అభ్యర్థికి తెలియపరచాలన్నారు. ప్రధానంగా హయ్యర్ పెన్షన్ లెక్కింపులో ఈపీఎఫ్ ఇచ్చిన చట్టవిరుద్ధమైన ఆటంకాలను రద్దుచేయాలన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం వినతిపత్రాన్ని సంబంధిత కార్యాలయ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లి, పిల్లల మృతికి సచివాలయ ఉద్యోగే కారణం

ఆమెను వెంటనే అరెస్టు చేయండి : ఎస్పీకి మృతురాలి బంధువుల ఫిర్యాదు


ఎస్పీకి ఫిర్యాదు చేసిన మృతురాలు రమాదేవి బంధువులు

రాయచోటిటౌన్, ఆగస్టు 20: స్థానిక కొత్తపేట తొగటవీధి వాసి రమాదేవి, ఆమె ఇద్దరు పిల్లలు అనుమానాస్పదస్థితిలో చనిపోవడానికి కారకులైన గున్నికుంట్ల సచివాలయ ఉద్యోగినిపై కేసు నమోదు చేసి తక్షణం ఆమెను అరెస్టు చేయాలని మృతురాలి సోదరుడు నారాయణ, ఆమె బంధువులు ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఎస్పీ కార్యాలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. తల్లీబిడ్డలు మృతి చెందిన వీధిలోనే గున్నికుంట్ల సచివాలయం ఉద్యోగిని నివాసం ఉంటోందన్నారు. రమాదేవి భర్త కువైత్ వెళ్లక ముందు ఈమెతో వివాహేతర సంబంధం కొనసాగిందని ఆరోపించారు. వృత్తిరీత్యా టైలర్ అయిన రమాదేవి వద్ద ఈమె బట్టలు కుట్టించుకుంటూ సఖ్యతగా మెలిగేదన్నారు. సచివాలయ ఉద్యోగిని భర్త ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవాడని అన్నారు. భర్త కువైత్‌కు వెళ్లిన తర్వాత రమాదేవితో సచివాలయ ఉద్యోగి భర్త స్నేహంగా ఉంటూ ఆమె నుంచి లక్షలాది రూపాయలు అప్పు తీసుకున్నాడన్నారు. ఈ నేపథ్యంలో భార్యపై అనుమానంతో రమాదేవి భర్త తమ ఇంట్లో ప్రతి గదిలో సీసీ కెమెరాలు బిగించి తన సెల్‌ఫోన్‌కు కనెక్ట్ చేసుకుని కువైత్ నుంచే పర్యవేక్షించేవాడు. సీసీ కెమెరాల్లో రమాదేవి 10 నిమిషాలు కనపడకపోతే వెంటనే అతను కువైత్ నుంచి సచివాలయ ఉద్యోగినికి ఫోన్‌చేసేవాడు. అంతేకాకుండా రమాదేవికి తన భర్తతో వివాహేతర సంబంధం ఉందంటూ సచివాలయ ఉద్యోగి నిత్యం వేధిస్తూ ఉండేది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగిని భర్త కువైత్ నుంచి రాయచోటికి రాబోతున్నాడని తెలుసుకుని తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వాలని రమాదేవి మూడు రోజుల కిందట వారి ఇంటికి వెళ్లి డిమాండ్ చేసింది. తన భర్తతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఊగిపోతున్న ఆమె ఈ సంఘటనతో మరింత రెచ్చిపోయి గత శనివారం రాత్రి పదిన్నర గంటలకు రమాదేవి ఇంటి వద్దకు వచ్చి పెద్దగా రభస చేసింది. ఆమె అరుపులకు భయపడిపోయిన రమాదేవి, ఆమె పిల్లలు లోపల గడియ పెట్టుకుని ఇంట్లో ఉండిపోయారు. అంతటితో ఆగని ఆమె ఇనుప రాడ్డు తీసుకుని వాకిలి తీస్తావా లేదా అంటూ గేటును గట్టిగా కొట్టి.. రాత్రంతా నానా రభస చేసింది. ఆమె గొడవ చేసిన అనంతరం రమాదేవి నుంచి కొన్ని మెసేజ్‌లు ఒకే సమయంలో ఇద్దరు, ముగ్గురికి వచ్చాయన్నారు. ఇదిలా ఉండగా రమాదేవి బిడ్డలు సహా గ్యాస్ లీక్ చేసుకుని గదిలో చనిపోయిందని రాయచోటి పోలీసులు చెబుతున్నారన్నారు. ఈమె మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఆమె మృతికి సచివాలయ ఉద్యోగే కారణమన్నారు. ఆ రోజు రాత్రి ఏమి జరిగిందో.. తక్షణమే సీసీ ఫుటేజి విడుదల చేయాలని రమాదేవి బంధువులు పోలీసులను కోరారు. ఈ సంఘటనలో సచివాలయ ఉద్యోగి, ఆమె అనుచరులను అరెస్టు చేసి.. న్యాయం చేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో మృతురాలు రమాదేవి సోదరుడు నారాయణ, బంధువులు కోరారు.

గండికోటలోకి 2000 క్యూసెక్కుల వర్షపు నీరు

కొండాపురం, ఆగస్టు 20: ఎగువప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి గండికోట ప్రాజెక్టులోకి 2000 క్యూసెక్కుల వర్షపునీరు చేరినట్లు డీఈ ఉమామహే శ్వర్లు తెలిపారు. అదే విధంగా జీఎన్ ఎస్ఎస్ కెనాల్ ద్వారా 10,800 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టులోకి చేరుతోందన్నారు. సీబీఆర్ లిఫ్టులకు 500 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయ సాగర్‌కు 500 క్యూసెక్కుల నీటిని గండికోట నుంచి వదులుతున్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 10.292 టీయంసీల నీరు నిల్వ ఉంది.

వ్యవసాయ మార్కెట్ కమిటి, కడప.			
ఆర్.ఓ.సి. నెం. 25/2024			తేది : 20.08.2024
టెండరు ప్రకటన			
వ్యవసాయ మార్కెట్ కమిటీ, కడప మార్కెట్ యార్డునందు ఈ క్రింద తెలిపిన పనికిగాను సీల్డు టెండర్లు కోరడమైనది.			
క్ర.నెం.	పని పేరు	పనికాలము	ధరావత్తు సొమ్ము
1.	పసుపు యార్డ్ నందు ప్రతిరోజు చెత్త ఊడ్చి ప్రోగుచేసి డంపు యార్డునకు తరలించుట	01.09.2024 నుండి 31.08.2025 వరకు	రూ. 50,000.00

టెండరు షెడ్యూలు ఖరీదు రూ. 500/- (ఐదు వందల రూపాయలు)
టెండరు షెడ్యూలు పొందు తేది 27.08.2024 సాయంత్రం 05.00 గంటలలోపు
టెండరు షెడ్యూలు దాఖలు తేది 29.08.2024 సాయంత్రం 05.00 గంటలలోపు
టెండరు షెడ్యూలు తెరుచు తేది 30.08.2024 సాయంత్రము 04.00 గంటలకు
ధరావత్తు సొమ్ముకు కార్యదర్శి, వ్యయసాయమార్కెట్ కమిటీ, కడప వారి పేరుమీద డిమాండు డ్రాఫ్టు తీసి టెండరు షెడ్యూలుతోపాటు సమర్పించవలయును. ఇతర వివరములకు కార్యాలయపు పనివేళలో సంప్రదించవచ్చును. ఏ కారణము చేతనైనా టెండరు రద్దు చేయుటకుగాని వాయిదా వేయుటకు మార్కెట్ కమిటికి అధికారము కలిగియున్నది.

శ్రీమతి టి. సుజాత, ఎంపిక శ్రేణి కార్యదర్శి (పూ.అ.భా.), వ్యవసాయ మార్కెట్ కమిటీ, కడప.
శ్రీ సి. రామాంజినేయులు, పర్సన్-ఇన్-ఛార్జ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, కడప.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

పోట్లాట !

- కడప సెక్రటరీ వర్సెస్ అనంతపురం ప్రెసిడెంట్
- ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్
- అసౌకర్యాలతో క్రీడాకారుల అవస్థలు
- జాతీయ ఫుట్‌బాల్ పోటీల వేదికగా విభేదాలు బహిర్గతం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 20: ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో కోల్డ్‌వార్ నడుస్తోంది. నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో గత మూడు వారాలుగా నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పోటీల వేదికగా విభేదాలు బహిర్గతమయ్యాయ. పోటీలకు జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి విద్యాశ్రీధర్ హాజరవుతారని చెప్పారు. అయితే నిర్వాహకులైన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ, కడప జిల్లా సెక్రటరీ డేనియల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మధ్య విభేదాలు, సమన్వయ లోపంతో ఆయ నకు ఆహ్వానం పంపలేదని సమాచారం. ఈక్ర మంలోనే ప్రారంభ వేడుకల్లో సైతం ఎవరికి వారుగా వేర్వేరుగా ఇద్దరూ ఉండి పోయారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కూడా అలా వచ్చి ఇలా వెళ్లి పోయారు. అంతా ఫొటోలకు ఫోజులిచ్చేవరకు ఉన్నారు. ముఖ్య అతిథులు వెళ్లిపోగానే గ్రౌండ్ మొత్తం ఖాళీ అయిపోయింది. ఇక అప్పటి నుంచి క్రీడాకారులకు సరైన భోజనం, వసతి అందడం లేదు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక క్రీడాకారులు మిన్నకుండి పోయారు. ప్రధాన నిర్వాహకులు డేనియల్ ప్రదీప్, వేణుగోపాల్‌లు మైదానంలో కనబడరు. ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ క్రీడాకారులను సమస్యల్లోకి నెట్టేశారు. సరైన షెడ్యూల్, ప్రోగ్రామింగ్ లేక పోటీల నిర్వహణ సైతం ఆలస్యంగా జరుగుతోంది. సెమీస్ పోటీల్లో ఎవరితో ఎవరు పోటీపడాలో అర్థం కాని పరిస్థితుల్లో జట్ల మధ్య విభేదాలు సృష్టించారు. ఇక సెమీస్ పోటీలు జరిగిన ఆదివారం క్రీడాకారులకు సరైన భోజనం లేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పోటీ లకు సంబంధించి విరాళాలు కూడా ఎవరికివారు వేర్వేరుగా వసూలు చేసినట్లు సమాచారం. దీనిపై జాతీయ ఫెడరేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు పలువురు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.

జాతీయ పోటీల వేదికగా తమకు కలుగుతున్న అసౌకర్యాలపై పలు రాష్ట్రాల క్రీడాకా రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ తీరు సక్రమంగా లేదని ఏపీ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కడప, అనంత పురం అధ్యక్ష, కార్యదర్శులు మధ్య తలెత్తిన మనస్పర్థలు, ఆధిపత్య పోరుతో ఇలా చేయడం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఆయా రాష్ట్రాల క్రీడాకారులు, మేనేజర్లు ఇక్కడ జరుగుతున్న వాస్తవాలను జాతీయ ఫుట్‌బాల్ ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు సమాచారం.

జాతీయ ఫుట్‌బాల్ బాలికల పోటీలప్రారంభోత్సవంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్)


రేపు వాణిజ్య పన్నుల కార్యాలయం ప్రారంభం

పులివెందుల టౌన్, ఆగస్టు 20: పులివెందులలో ఈనెల 21వ తేదీన వాణిజ్య పన్నుల శాఖ నూతన కార్యాలయాన్ని (స్టేట్ జీఎస్టీ ఆఫీస్) ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రారంభించనున్నారు. 20 ఏళ్ల తర్వాత మొట్టమొదటి సారిగా పులివెందులలో ఈ కార్యాలయం ప్రారంభించడం విశేషం. మిట్టమల్లేశ్వరస్వామి శివాలయం ఎదురుగా బుధవారం ఉదయం 11గంటలకు కార్యాలయం ప్రారంభించనున్నారు. వ్యాపారులు, వివిధ వాణిజ్య సముదాయ ప్రతి, పలు సంస్థల ప్రతినిధులు పా ల్గొని జయప్రదం చేయాలని పులివెందుల ఆడిటర్ల అసోసియేషన్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తెలిపారు.

మానవతా విలువలు పెంపొందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మానవతా సంస్థ ప్రతినిధులు

వేంపల్లె, ఆగస్టు 20: మానవతా విలువలు పెంపొందించడమే లక్ష్యమని మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవార వేంపల్లెలో పలు పాఠశాల విద్యార్థులతో కలిసి శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మానవత సంస్థ శాంతి వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో మానవతా విలువలను పెంచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మానవత డైరెక్టర్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ కరస్పాండెంట్ రమణారెడ్డి, శ్లోక కరస్పాండెంట్ నవనీశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు రామాంజులరెడ్డి, బాలాజి, వేంపల్లె అధ్యక్షుడు శ్రావణ్, డాక్టర్ యోగీశ్వర్‌బాబు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి ప్రసూతి సెలవుపై హర్షం

వేంపల్లె, ఆగస్టు 20:ఆర్జీయూకేటీలో పనిచేస్తున్న మహిళా అతిథి అధ్యాపకులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి (మెటర్నటీ) సెలవు ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించడం అతిథి అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హర్షం వ్యక్తం చేశారు. అతిథి అధ్యాపకులు ఇడుపులపాయ, ఒంగోలు డైరెక్టర్లు కుమారస్వామి గుప్త, భాస్కర్ పటేల్‌ను కలిసి స్వీట్లు పంచిపెట్టారు. అతిథి అధ్యాపకులను సాధారణ అధ్యాపకులుగా గుర్తించాలని, సమాన పనికిసమాన వేతనం ఇవ్వాలని, మినిమమ్ టైం స్కేల్ మంజూరు చేయాలని ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఓల్డ్ పెన్షన్ సదుపాయం కల్పించండి



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప (మారుతీనగర్), ఆగస్టు 20: ఆర్టీసీ ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆర్టీసీ కార్మిక పరిషత్ నాయకులు మంగళవారం మంత్రి లోకేశ్‌కు విజయవాడలో విన్నవించారు. వారు మాట్లాడుతూ వివిధ కేటగిరిలలో ఖాళీలను పదోన్నతుల ద్వారా నింపాలన్నారు. డ్రైవర్స్, కండక్టర్స్‌తో పాటు ఇతర కేటగిరి ఉద్యోగులకు డ్యూటీ బెస్ట్ అలవెన్స్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావు, కడప జిల్లా కార్యదర్శి ఎం.పురుషోత్తం పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను నివారించండి

చెన్నూరు, ఆగస్టు 20 : మండలంలోని రామనపల్లెలో అసాంఘిక కార్యకలాపాలను నివారించాలని ఆ గ్రామ టీడీపీ నేతలు మంగళవారం సీఐ పురుషోత్తంరాజును కోరారు. ఈ మేరకు టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, అటవీశాఖ రాష్ట్ర మాజీ డైరెక్టరు రామన శ్రీలక్ష్మి సీఐని కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అల్లాడు రాజశేకర్‌రెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం, మణికంఠ,మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ పుత్తా వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్ర అభినందనీయం: టీడీపీ

కమలాపురం రూరల్, ఆగస్టు 20:రాష్ట్రం అభివృద్ధి కోసం టీడీపీ నేత ప్రవీణ్ పాదయాత్ర చేయడం అభినందనీయమని టీడీపీ ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు.మంగళవారం అలిపిరి టు అమరావతి పాదయాత్ర సందర్భంగా ప్రవీణ్‌కుమార్ కమలాపురం చేరుకున్నాడు. ఆయనకు టీడీపీ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు.

'కేసీ'కి దిక్కెవ్వరు..?





కడప నగరంలో ఉన్న కేసీ కెనాల్‌ను పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు..దీంతో కాలువ నిండా పిచ్చిమొక్కలు, తుంగ, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాలువ అంచున కంపచెట్లు ఏపుగా పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది. పాములు స్థావరాలు ఏర్పరచుకుని స్వేచ్ఛగా తిరుగాడుతున్నాయి.. కాలువ వైపు చూసిన వారంతా 'కేసీ కెనాల్‌ను పట్టించుకునే నాథుడే లేరా..' అని చర్చించు కుంటున్నారు.. దేవునికడప రోడ్డులోని కేసీ కెనాల్‌లో ఈ దుస్థితి నెలకొంది.

- ఫొటోలు
ప్రధాన ఫొటోగ్రాఫర్, కడప





సినీ కళామతల్లి ముద్దుబిడ్డ, శ్రమజీవి చిరంజీవి

● దుర్గాసంస్థల అధినేత దుర్గాప్రసాద్



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్, చిరు అభిమాన సంఘం ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 : సినీ కళామతల్లి ముద్దుబిడ్డ, శ్రమజీవి మెగాస్టార్ చిరంజీవి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, దుర్గా సంస్థల అధినేత దుర్గాప్రసాద్ కొనియాడారు.మంగళవారం కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు పండ్ర రంజిత్ కుమార్ సమక్షంలో హమాలీలకు కొత్తదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సినీ కళామతల్లి ముద్దుబిడ్డగా సొంత శ్రమతో అనేక దశాబ్దాలపాటు తెలుగు సినీ ప్రేక్షకులను అలరిస్తూ తన అభిమానులను సేవా మార్గాల వైపు నడిపిస్తూ చిరంజీవి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అటువంటి వ్యక్తి పుట్టినరోజు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. గురుశేఖర్, రవికుమార్, నాగరాజు, నాగేంద్ర, శేష రాయల్, లక్ష్మిరామ్, షేక్‌హుసేన్, నవీన్, బాలాజీ, మనోహర్, శివ పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



రాహుకాల దీపాలను వెలిగిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కడప (కల్చరల్), ఆగస్టు 20:విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి సన్నిధికి చేరుకుని భక్తిశ్రద్ధలతో నివ మ్మ కా య ు లతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ అన్ని ఏర్పాట్లు చేశారు.

నిరాశ్రయులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో మలిరెడ్డి చంద్రశేఖరరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 : కడప నగరం నిరాశ్రయుల వసతిగృహంలో మంగళవారం సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు శివానందరెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి యేటా తన సోదరుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. తిరుమలశెట్టి రఘురాం, ప్రసాదనాయుడు, శివశంకర్, అశోక్‌కుమార్, ఖాదర్‌వలి, వసతిగృహం నిర్వాహకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే మాధవి



కమిషనరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 : కడప నగరంలో పెండింగులో ఉన్న డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కడప ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరం బిల్డప్ సర్కిల్‌లో పెండింగులో ఉన్న డ్రైనేజీ పనులను కమిషనర్ వైవో నందన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం నిర్మాణానికి సంబంధించి అంచనాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తా

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు: కమిషనరు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 :విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనరు వైవో నందన్ అన్నారు. కడప నగరంలో గండి వాటర్‌వర్క్స్, జగన్న కాలనీ, పక్కీరుపల్లె చెరువు, నిరంజన్‌నగర్‌కాలనీలను ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ప్రజలకు నీటి సరఫరా సమృద్ధిగా పంపిణీ చేయాలని సూచించారు. అలాగే స్టాకు రిజిస్టర్లు, అటెండెన్స్ రిజిస్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో మహిళ ఆత్మహత్య

కడప (క్రైం), ఆగస్టు 20 : కడప నగరం రవీంద్రనగర్‌లో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. హసీనా (48) భర్త మస్తాన్‌ఖాన్ పిల్లలతో కలిసి రవీంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ, ఆర్థిక సమస్యల వల్ల మంగళవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

కడప (క్రైం), ఆగస్టు 20 : కడప నగరం అల్మాస్‌పేటకు చెందిన మైనర్ బాలిక అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. అల్మాస్‌పేటకు చెందిన బాలిక సోమవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి అదృశ్యం కావడంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

'నేటి భారత్ బంద్‌ను జయప్రదం చేయండి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 :నేటి భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని మాలమహానాడు నాయకుడు, రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు నిరసనగా దేశవ్యాప్తంగా బహుజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం చేపట్టే భారత్‌బంద్‌కు అందరూ సహకరించాలన్నారు.

న్యాయం చేయండి

కడప (మారుతీనగర్) ఆగస్టు 20: పులివెందుల తాలూకా ఎన్‌జీఓ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో 1991లో సభ్యత్వం తీసుకున్నానని పులివెందుల బాకరాపురం నివాసి రోసిలిన్ విలేకరులతో పేర్కొన్నారు. 2002లో ప్లాట్ కోసం రూ.1300, రెండవ కంతుగా రూ.3,000 సొసైటీకి చెల్లించానన్నారు. ఇంతవరకు తనకు ప్లాట్ ఇవ్వకపోగా సొసైటీకి చెందిన వారు బెదిరిస్తూ దిక్కున్న చోట చెప్పుకోపో అంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వీసీ నియామకం ఉపసంహరించుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 : వైవీయూ వీసీ నియామకాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం వైవీయులో ఈ నెల 23న వైవీయూ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అవినీతి ఆరోపనలు ఎదుర్కొంటున్న వీసీ నియమాకాన్ని ప్రభుత్వం ఉపసంహరిచుకోవాలన్నారు.

హాస్టళ్ల తనిఖీ

కడప (క్రైం), ఆగస్టు 20 : ఎస్పీ ఆదేశాల మేరకు నగరంలోని 13 కళాశాల విద్యార్థినుల ప్రైవేటు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను మంగళవారం సాయంత్రం మహిళా ఎస్ఐలు, సిబ్బంది తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలుంటే తమకు తెలపాలన్నారు. కార్యక్రమంలో మహిళా ఎస్ఐలు జ్యోతి, లక్ష్మీ, శాంతమ్మ, హైమావతి, నస్రీన్, సిబ్బంది ఉన్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20: నాడు-నేడు పనుల్లో జరిగిన అవినీతిపైవిచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరు కార్యాలయంలో ఏఓ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్ పాల్గొన్నారు.

వీసీపై అసత్య ఆరోపణలను ఖండిస్తున్నాం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 20 : వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డిపై ఆరోపనలు ఖండిస్తున్నామని వైవీయూ అధ్యాపక సంఘం తాత్కాలిక అధ్యక్షుడు ప్రొఫెసరు క్రిష్ణారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.సుభాష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి వైవీయూలో ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా గిట్టని వారు ప్రైవేటు సంభాషణలు రికార్డు చేసి వైరల్ చేయించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలి: కలెక్టర్



మొక్కలు నాటుతున్న కలెక్టర్ శివశంకర్

పెండ్లిమర్రి, ఆగస్టు 20: గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పిలుపునిచ్చారు. ఈనెల 23న రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న గ్రామసభల సంసిద్ధతపై మంగళవారం మండలంలోని పగడాలపల్లె ఎంపీపీ పాఠశాలలో గ్రామ సర్పంచు గ్రామ సభను నిర్వహించారు. ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు గ్రామ సర్పంచు సంగటి పెద్దగంగిరెడ్డి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కలెక్టర్ శివశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏడు రెవిన్యూ గ్రామాలు, 2500 జనాభాతో ఉన్న చెర్లోపల్లె గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మౌలిక సదుపాయాలను కల్పించే ఉద్దేశంతో ప్రతి కుటుంబానికి వంద రోజుల ఉపాధి హామీ పనిని కల్పిస్తామన్నారు. గ్రామంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులు, దాదాపు రూ.2కోట్లతో పలు మౌలిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించామన్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ జోయల్ వియ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళి పీఆర్ ఏఈ సుబ్బయ్య పాల్గొన్నారు.

రిమ్స్, జీజీహెచ్, డెంటల్ కళాశాలల్లో భద్రత కల్పిస్తాం

కడప(కలెక్టరేట్), ఆగస్టు 20: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్), మెడికల్ కళాశాల(రిమ్స్), డెంటల్ కళాశాల పరిసరాల్లో వైద్య సిబ్బందికి, వైద్య విద్యార్థులకు, రోగులకు, మహిళా సిబ్బందికి భద్రతా చర్యలను పటిష్టం చేస్తామని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో సమీ నిర్వహించారు.

లే అవుట్లకు అనుమతి తప్పనిసరి : కమిషనర్

కమలాపురం రూరల్, ఆగస్టు 20 : కమలాపురం నగర పంచాయతీ కార్యాలయంలో అనుమతులు తీసుకోకుండా లేఅవుట్లు వేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనరు రాముడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గవర్నమెంటు ఆఫ్ ఏపీ ఆదేశాల మేరకు కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని అనధికార లేఅవుట్లపైన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కమలాపురం నగర పంచాయతీ పరిధిలో సర్వే నెం. 726, 727, 729, 734, 735, 788 కమలాపురం 627, 435, 436, 437, 433, 196/ఎ, 196/బి, 1135, 984, 715 నెంబర్లలో అనధికారికంగా లేఅవుట్లు వేశారని, ఈ స్థలాల్లో ప్లాట్లు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ ప్లాట్లకు అమ్మకం, కొనుగోలుకు వీల్లేదన్నారు. అలాగే భవన నిర్మాణ అనుమతులు మంజూరు కావన్నారు. మౌలిక వసతులు అయిన రోడ్లు, కరెంటు సదుపాయాలు కల్పించరన్నారు. అనధికారికంగా లేఅవుట్లు, అమ్మకాలు చేస్తున్న స్థల యజమానులు లేదా డెవలపర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంజన్నకు మొక్కు తీర్చుకున్న అభిమానులు



ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, లక్ష్మీరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

వల్లూరు, ఆగస్టు 20 :పుత్తా చైతన్యరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినందుకు గాను మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, యువ నాయకుడు పుత్తా లక్ష్మీరెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామికి 101 టెంకాయలు కొట్టి అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరెడ్డి, గోటూరు మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు పీఎస్ నెంబర్లు మంజూరు: సీఐ



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ హాజీవలి

పులివెందుల టౌన్, ఆగస్టు 20: పులివెందుల పరిధిలోని ఆటోలకు పీఎస్ నెంబర్లు మంజూరు చేసినట్లు ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో, పులివెందుల డీఎస్పీ ఉత్తర్వుల మేరకు మంగళవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో పట్టణంలోని ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సుమారు 600 ఆటోలకు గాను దాదాపు 340 ఆటోలకు పీఎస్ నెంబర్లు మంజూరయ్యాయని, మిగిలిన వారు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మంజూరు చేసుకోవాలన్నారు. ప్రజలు ఆటోల్లో ప్రయాణిస్తూ తమ విలువైన వస్తువులు, డబ్బు మరచిపోయి వెళ్లినపుడు వాటిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు. ప్రతిఆటో డ్రైవర్ తప్పకుండా రికార్డులు కలిగి, ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

గండి నూతన పాలక మండలిని ఏర్పాటు చేయాలని వినతి



దేవదాయశాఖ మంత్రితో మాట్లాడుతున్న గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి తదితరులు

చక్రాయపేట, ఆగస్టు 20: ప్రసిద్ధిచెందిన గండి క్షేత్రం నూతన పాలక మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి గండి మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరులోని ఆయన ఇంటి వద్ద ఉన్న మంత్రిని మంగళవారం వెంకటస్వామి, టీడీపీ నాయకులు ఎద్దుల చంద్ర, అశోక్, ఈశ్వరయ్య, బాల అంకిరెడ్డి, ప్రసాద్ తదితరులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సూచన మేరకు వచ్చామని, వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన పాలక మండలి కొనసాగుతోందని, వాటిని రద్దుచేసి కొత్తగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేడుకగా మంగళగౌరీ దేవి వ్రతం



మంగళగౌరీదేవి వ్రతం ఆచరిస్తున్న ముత్తైదువులు

వేంపల్లె, ఆగస్టు 20: శ్రావణ మాసం సందర్భంగా వేంపల్లెలోని బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంగళగౌరీదేవి ఆలయంలో మంగళగౌరీదేవి వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ పూజారి ప్రసాదరావు ఆధ్వర్యంలో వ్రతపూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో ఆలయానికి చేరుకొని వ్రతపూజలు చేశారు. లలితసహస్ర పారాయణం నిర్వహించారు. బలిజ సంఘం మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. సంఘం అధ్యక్షుడు కటిక చంద్రశేఖర్, కుళాయప్ప, మాజీ అధ్యక్షుడు కొత్తూరు రెడ్డయ్య, కార్యదర్శి నామాశేఖర్, డాక్టర్ రాజారామ్, మహిళా మండలి అధ్యక్షుడు కొత్తూరు రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరిస్తా: ఆర్టీసీ డీఎం



హైవేను పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం, సీఐ

చెన్నూరు, ఆగస్టు 20 : ప్రమాదాల నివారణకు సహకరిస్తానని ఆర్టీసీ డిపో మేనేజరు డిల్లీశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చెన్నూరు హైవే రహదారిపై సీఐ పురుషోత్తంరాజుతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు ఇప్పటి వరకు నిలిపే స్థలాలను మారుస్తామన్నారు. కడప వైపు వెళ్లే బస్సులు ముందు వైపునకు వంద మీటర్లపైన వెళ్లి నిలుపుతారని, అలాగే మైదుకూరు వైపు వెళ్లే బస్సులను కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా నిలిపేలా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ఆదేశాలు ఇస్తామన్నారు. సీఐ పురుషోత్తంరాజు ప్రమాదాలు జరగకుండా బస్సులు ఎక్కడెక్కడ ఆపాలో డీఎంకు వివరించారు. ఏఎస్ఐలు సుధాకర్, ఆంజనేయులు, హెడ్‌కానిస్టేబుళ్లు సుబ్బయ్య, సుధాకర్, వీరారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: సీఐ

విద్యార్థులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీఐ పురుషోత్తంరాజు సూచించారు. మంగళవారం రామనపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణంలో వ్యర్థాలు వేయరాదని, విద్యార్థులు పరస్పరం సోదర సోదరీ భావంతో మెలగాలన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి: ఎస్ఐ



సింహాద్రిపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తులసినాగప్రసాద్

సింహాద్రిపురం, ఆగస్టు 20: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ సూచించారు. ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేర కు మంగళవారం సింహాద్రిపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, లోన్ యాప్, సైబర్ మోసాల ప ట్ల ఎలా జాగ్రత్తపడాలో వివరించారు. సైబర్ మోసగాళ్లు నిత్యం లాటరీలు, లక్కీడ్రాలు అంటూ ఓటీపీలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చే స్తారన్నారు.ఎవ్వరికి ఓటీపీ చెప్పకూడదన్నారు. సమస్య ఎదురైనప్పుడు ఏయే ఫోన్ నెంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చో వివరించారు.

ఏఎస్పీల సేవలు ప్రశంసనీయం



ఏఎస్పీలను సన్మానించిన దృశ్యం

కడప (క్రైం), ఆగస్టు 20 : జిల్లాలో అదనపు ఎస్పీగా సుధాకర్, సెబ్ అదనపు ఎస్పీగా వెంకటరాముడు చేసిన సేవలు ప్రశంసనీయమని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కొనియాడారు. మంగళవార జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో బదిలీపై వెళుతున్న ఏఎస్పీలను మంగళవారం ఎస్పీ ఘనంగా సన్మానించారు. సుధాకర్, వెంకట్రాముడు బాగా పనిచేశారని అన్నారు. అనంతరం ఏఎస్పీలకు మెమొంటోలను అందించారు. అలాగే ఎఆర్ఎస్పీ క్రిష్ణారావు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎఎస్పీలను ఘనంగా సన్మానించారు.

రేపు నిర్మాణసామగ్రి వేలం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20: రామేశ్వరం గ్రామ రెవెన్యూ పొలంలోని సుంకువెంకటసుబ్బయ్య సత్రం స్థలంలో దేవదాయ శాఖ అనుమతి లేకుండా నిలువ ఉంచిన నిర్మాణ సామగ్రిని వేలం వేస్తున్నట్లు సుంకుసత్రం ఈవో రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నంబరు 133, 150లోని 13.62 ఎకరాల స్థలంలో ఇసుక డంపింగ్, ఇటుకలు, కంకర, ఫ్లయాష్, ఇంటి నిర్మాణ సామగ్రిని నిలువ ఉంచారని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు అక్కడే బహిరంగ వేలం వేస్తామని, వేలంపాటలో పాల్గొనేవారు రూ.10 వేలు దరావత్తు చెల్లించాలని కోరారు. హెచ్చు పాటదారుడు వేలం ముగిసిన వెంటనే మొత్తం డబ్బులు చెల్లించి వారంరోజులలోపల అక్కడున్న సామగ్రిని తరలించాలని పేర్కొన్నారు.





జమ్మలమడుగులో భారీ వర్షం

జమ్మలమడుగు, ఆగస్టు 20: జమ్మలమడుగులో సోమవారం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. నెల రోజులుగా రైతులు వర్షం కోసం ఎదురుచూశారు. పది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతతో తల్లడిల్లిపోయారు. ఒక్కసారిగా రాత్రి భారీ వర్షం కురవడంతో పలుచోట్ల వర్షపునీరు నిలిచింది. జమ్మలమడుగులోని ఆర్టీసీ గ్యారేజీ ఆవరణం, ఎల్ఎంసీ కాంపౌండ్, వర్షపునీరు నిలిచింది. ప్రొద్దుటూరు రోడ్డులోని దేవగుడి బ్రాంచ్ కెనాల్ కాలువ డ్రైనేజీనీరు, వర్షపునీటితో నిండుకుండలా మారింది. అలాగే ధర్మాపురం, పి.సుగుమంచిపల్లె, దేవగుడి, తదితర గ్రామాల్లో పొలాల్లో వర్షపునీరు నిలిచింది. దేవగుడి గ్రామం సర్కిల్‌లో ప్రధాన రోడ్డుపై పొలంలో వర్షపునీరు నిలిచింది. పి.సుగుమంచిపల్లె గ్రామం వద్ద పురాతన కోనేరులు, ప్రధాన రోడ్డుపై, పొలాల్లో వర్షపునీరు ప్రవహించింది. భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషించారు. కాగా మోరగుడి గ్రామం తాడిపత్రి రోడ్డు పక్కన, మండల ప్రాథమిక పాఠశాల (



జమ్మలమడుగు ఆర్టీసీ గ్యారేజీలో నిలిచిన వర్షపునీరు

మెయిన్) పాఠశాల,లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ కాలువలు వర్షపునీటితో నిండాయి. చుట్టుపక్కల నుంచి వర్షపునీరంతా పాఠశాలలోకి చేరుతోంది.

లంచగొండి అధికారులు వెళ్లిపోవాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 : ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి లంచగొండితనం మాని నిజాయితీగా పని చేయాలని చెప్పినా మార్పురాలేదని వారు ఇక్కడ వుండరాదని సెలవు పెట్టి వెళ్లి పోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొర్రపాడు రోడ్డు లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వెళ్లి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ కార్యాలయం అవినీతి నిలయంగా మార్చారని గతంలో హెచ్చరించినా మళ్లీ యథాతథంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ వున్న స్టాంప్ రైటర్లు కొందరు కమీషన్ల పర్వంను సాగిస్తున్నారన్నారు. ముఖ్యంగా కార్యాలయంలో ముగ్గురు అధికారులపై అవినీతి ఆరోపణలు వున్నాయని వీరితీరు మార్చుకోమని చెప్పినా మారటం లేదని వీరిపై నేరుగా కడప స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ కి ఎమ్మెల్యే ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డీఐజీకి తెలిపారు. ఇదే తీరులో వుంటే రోజు కార్యాలయానికి వచ్చి కూర్చుంటానని హెచ్చరించారు.

ప్రపంచ శాంతికోసం ర్యాలీ



శాంతి ర్యాలీ చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఆగస్టు 20: జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ శాంతికోసం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవతా సేవా సంస్థ గౌరవ సభ్యులు కలిసి ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ ర్యాలీనిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్, విద్యాశాఖాధికారి చంద్రశేఖర్‌రావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి పాత బస్టాండులో గాంధీ విగ్రహం వద్ద ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌రెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజమంతా బాధ్యతాయుతంగా మెలగాలి

ప్రొద్దుటూరు, ఆగస్టు 20 : ఆడవాళ్ళపై అఘాయిత్యాలు ఆగాలంటే సమాజమంతా బాధ్యతాయుతంగా మెలగాలని, కోల్‌కత్తాలాంటి సంఘటనలు జరగవని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ పిలుపునిచ్చారు. మంగళవారం నందిని కాంప్లెక్స్‌లోని జేవీవీ కార్యాలయంలో కోల్‌కత్తాలో మహిళా డాక్టర్ పై జరిగిన గ్యాంగ్ రేప్ సంఘటన సందర్భంలో సమాజం బాధ్యత అనే అంశం పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేవీవీ సమతా జిల్లాకన్వీనర్ దేవమణి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాయలసీమ మహా సభ కన్వీనర్ ఖలందర్ సీపీఎం సత్యం ఎంపీజే సలీం, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు భారతి, శిరీష ముంతాజ్, రాక్సానా సమయ, జేవీవీ సురేష్, సునీత ,జింకా సుబ్రమణ్యం, ఇన్సాఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచి ఆదుకోవాలి

ఎర్రగుంట్ల, ఆగస్టు 20: కాంట్రాక్టు కార్మికులకు 13 ఏళ్లుగా జీతాలు పెరగకపోవడంతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని, జీతాలు పెంచి ఆదుకోవాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఈవిషయంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కార్మికశాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. పరిశ్రమల యజమానులతో మాట్లాడి ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామి ఇచ్చినట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. మంత్రికి వినతి పత్రం ఇచ్చిన వారిలో మోహన్‌రావు, గంగయ్య, షంషేర్ వల్లి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటువ్యాధి రాకుండా టీకాలు వేయించాలి

కలసపాడు, ఆగస్టు 20 : మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు జబ్బులు రాకుండా మంగళవారం నుంచి సెప్టెంబరు 18వతేదీ వరకు ఉచితంగా టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పిడుగుపల్లె, ముద్దంవారిపల్లె గ్రామాల్లో అన్ని పశువులకు (గేదె జాతి, గోజాతి)లకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు.

బడి బయట పిల్లలు బడిలో చేరిక : ఎంఈవో

బి.కోడూరు, ఆగస్టు 20 : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో తోటలో నివాసం ఉంటున్న రెండు కుటుంబాలకు చెందిన నలుగురు విద్యార్థులను తుమ్మలపల్లె ప్రాథమికపాఠశాలలో చేర్పించినట్లు ఎంఈవో సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రాంతం నుంచి వలస కూలీలుగా వచ్చిన ఇక్కడ తోటమాలిగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటరమణ, నజీం బాషా పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలు

బద్వేలు, ఆగస్టు 20: మండలంలోని సి. కొత్తపల్లె 54/1, 54/2, 54/3, 54/4 సర్వేనెంబర్లలో ప్రభుత్వ భూములలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కబ్జాదారులనుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలంటూ తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలలో సునీత, గుర్రమ్మ తదితరులు కూర్చున్నారు.ఈ దీక్షలను కార్మిక మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉమ, దుర్గమ్మలు ప్రారంభించారు.

దోమలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఎర్రగుంట్ల, ఆగస్టు 20: దోమల వల్ల కలిగే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతికళ సిబ్బందిని ఆదేశించారు. ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా ఆమె ఎర్రగుంట్ల అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు, సిబ్బందితో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా దోమల వల్ల కలిగే రోగాలను ప్రజలకు తెలియజేసి వ్యాధులు రాకుండా చూడాలన్నారు. క్రాంతినగర్‌ను ఆమె తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, జోత్స్న, ప్రియాంక, హెల్త్ ఎడ్యుకేటర్ వేంకటేశ్వర్లు, హెచ్‌ఈవో రవిశంకర్, సబ్‌యూనిట్ అధికారి లక్షుమయ్య, ప్రసాద్, సూపర్‌వైజర్స్ ఓబులేసు, లక్ష్మీదేవమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

అట్లూరు, ఆగస్టు 20 : కస్తూర్బా గురుకుల పాఠశాల ప్రత్యేక అధికారి ఫణిశ్రీపై వచ్చిన ఆరోపణలపై మంగళవారం డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, డీసీడీవో విజయలక్ష్మి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం, నిత్యావసర సరుకులను మెనూ రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎస్‌వోపై వచ్చిన ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈవో విలియం రాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి: ఎంపీపీ

కాశినాయన ఆగస్టు20: ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు దృష్టిపెట్టాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ,జడ్పీటీసీ డీసీ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో మైథిలీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, మండల అధి కారులు, సర్పంచ్‌లు బి.ప్రభాకర్‌రెడ్డి,బోరెడ్డిజయమ్మ,బి.పిచ్చిరెడ్డిప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు, ఆగస్టు 20: జమ్మలమడుగులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు మీకు తెలుసా హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీవారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, శంకర్‌రెడ్డి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయండి

రాజుపాలెం, ఆగస్టు 20 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గత ప్రభుత్వంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులను ఇళ్లను త్వరితంగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం టంగుటూరులోని జగనన్నకాలనీ, ఎస్సీ కాలనీ తదితర గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడుతూ డిసెంబరులోగా గృహాలు పూర్తి చేసుకుంటే బిల్లులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శేఖర్‌యాదవ్, ఏఈ నరేశ్, వర్క్‌ఇన్‌స్పెక్టరు ఓబన్న పాల్గొన్నారు.

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

జమ్మలమడుగు, ఆగస్టు 20: పశువుల పెంపకంలో రైతులు వాటిని పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యశాఖ ఏడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి, చలివెందుల, గూడెం చెరువు గ్రామాల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు దస్తగిరమ్మ, జాన్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20: వసంతపేటలోని పాత రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మంగళవారం తెల్లవారుజామున స్వామివారి బృందావనానికి విశేష పూజలు, అర్చనలు చేసి పూలమాలలు, వెండి కవచాలతో అలంకరించారు. గోపాలకృష్ణునికి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి పూజించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.





దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు , ఆగస్టు 20 : మెగా స్టార్‌చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా మెగా అభిమానులు సోమవారం రాత్రి పట్టణంలో ప్రధాన రోడ్లైన మైదుకూరు రోడ్డు టీబీ రోడ్డు జమ్మలమడుగు రోడ్డు శివాలయం సెంటర్‌లలో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మెగాస్టార్ చిరంజీవి యూత్ అధ్యక్షుడు అక్కిదాసరి రామారావు, మెగా అభిమానులు షరీఫ్, చంద్రధర్, బాబురావు, మధు, చెన్నరవి, కేశవ, షేక్‌నాయక్ పల్లా రఘు, చిన్న రాము, రాజులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు నిర్మించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 20: గోపవరం పంచాయతీ ద్వారకానగరంలో రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కుళాయమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా రోడ్లు, కాలువలు లేక ద్వారకానగర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జీసీ పుల్లయ్య, సుధాకర్‌యాదవ్, వెంకటసుబ్బయ్య ఆచారి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 20 : పట్టణంలోని యానాది కాలనీకి చెందిన బుదినంపల్లె గౌరీ (21) అనే వివాహిత తల పూసుకునే నూనె తాగి ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసులు వివరాల మేరకు... సంజీవనగర్‌కు చెందిన వెంకటేశ్‌కు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె గౌరికి ఐదేళ్ల క్రితం ఆంజినేయులు అనే వ్యక్తితో వివాహం అయింది. వారికి ముగ్గురు ఆడబిడ్డలు. ఆంజినేయులు కొన్ని రోజుల నుంచి భార్య గౌరీని వేధించసాగాడు. ఈ క్రమంలోనే ఈనెల 18వ తేదీ తలకు పూసుకునే నూనె తాగినట్లు కుమార్తె చెప్పడంతో వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. కాగా మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

మైలవరం, ఆగస్టు 20 : గ్రామాలలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం తలమంచిపట్నం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జూదం, మట్కా, సారాకు ప్రజలు బానిసలు కాకుండా గ్రామాల లో పోలీసుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుందన్నారు.

5న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, ఆగస్టు 20 : విద్యుత్ కార్మికుల సమస్యలపై సెప్టెంబరు 5న తిరుపతి ఎస్పీడీసీఎల్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. మంగళ వారం పోరుమామిళ్లలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సబ్‌డివిజన్ కమిటీ నాయకులు సురేశ్, నౌషాద్, గిరి, దశరథరామిరెడ్డి, గురప్ప, రాజశేఖర్, నబీ, రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



పోరుమామిళ్లలో కొవ్వొత్తుల ర్యాలీ

మైదుకూరు రూరల్, ఆగస్టు 20 : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచారంపై నిరసనగా మంగళ వారం మైదుకూరులోని జూనియర్ డాక్టర్లు, బీజేపీ నాయ కులు,ఇతర ప్రజాసంఘాల వారు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం రాయల్ కూడలి వద్ద మాట్లాడారు.నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పోరుమామిళ్ల..: ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు తీయడం అమానుషమని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. మంగళవారం రాత్రి సీపీఐ ప్రజాసంఘాలు, ఆర్ఎంపీ వైద్యులు దళితసంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు వైద్యఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.





